ఇంటర్ సెకండియర్ సప్లిమెంటరీలో 81 శాతం ఉత్తీర్ణత

పాడేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సెకండియర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను మంగళవారం ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో ఇంటర్ రెండో ఏడాది సప్లిమెంటరీ పరీక్షల్లో 81 శాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా ఏడు పరీక్షా కేంద్రాల్లో 1,691 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. వారిలో 1,370 ఉత్తీర్ణత సాధించారు. అలాగే 321 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. దీంతో జిల్లాలో ఇంటర్ రెండో ఏడాది సప్లిమెంటరీ పరీక్షల్లో 81 శాతం ఉత్తీర్ణత అని అధికారులు నిర్ధారించారు.

పీజీ సెట్‌లో ర్యాంకుల పంట

జియో ఇంజనీరింగ్, మెకానికల్, మెటలర్జీ విభాగాల్లో ప్రథమ ర్యాంకులు

- సాధించిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు
- పది లోపు ర్యాంకులు అనేక మందికి రాక

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్/ఫార్మసీ కళాశాలల్లో ఎంటెక్/ఎం.ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపీ పీజీసెట్‌లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా విద్యార్థులు మూడు కేటగిరీలలో ప్రథమ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. జియో ఇంజనీరింగ్‌లో నగరంలోని రామ్‌నగర్‌కు చెందిన సింగంశెట్టి రమ 78 మార్కులతో, మెకానికల్ ఇంజనీరింగ్‌లో పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామానికి చెందిన పైలా హేమంత్ 80 మార్కులతో, మెటలర్జీలో అనకాపల్లి మండలం వీజే పాలెం గ్రామం క్వారీ కాలనీ విద్యార్థి నందికొల్లు అనిల్‌కుమార్ 86 మార్కులతో ప్రథమ ర్యాంకులు సాధించారు. అలాగే జియో ఇంజనీరింగ్‌లో మర్రిపాలెం వుడా కాలనీ విద్యార్థిని తురుపల్లి కీర్తి రెండో ర్యాంకు, టీఎస్ఎన్ కాలనీలో ఉంటున్న మహ్మద్ అనిత్ సింకా మూడో ర్యాంకు, రోలుగుంట విద్యార్థి రుత్తల వెంకటకృష్ణ ఎనిమిదో ర్యాంకు, దేవరాపల్లి మండలం మారేపల్లికి చెందిన గేదెల నవ్య తొమ్మిదో ర్యాంకు సాధించారు. బయో టెక్నాలజీలో నగరానికి చెందిన దాసరి దేదీప్య 10వ ర్యాంకు, సివిల్ ఇంజనీరింగ్‌లో కె.కోటపాడు మండలం వారాడ విద్యార్థి రాచపల్లి హేమంత్ రెండో ర్యాంకు, అనకాపల్లి దరి అడ్డాసరం విద్యార్థి పి.మహేష్ ఐదో ర్యాంకు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో రాంబిల్లి మండలం కొప్పగుంటపాలెం గ్రామానికి చెందిన గొన్నబత్తుల సాయికుమారి ఏడో ర్యాంకు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో నగరంలోని శాంతిపురానికి చెందిన గనగళ్ల హాయిశ్రీ 11వ ర్యాంకు, ఫుడ్ టెక్నాలజీ కోర్సులో చైతన్య నగర్‌కు చెందిన హనుమంతు ధారణి నాలుగో ర్యాంకు, మెటలర్జీలో కంచరపాలేనికి చెందిన గుడ్ల జయంత్ మూడో ర్యాంకు, శ్రీనగర్ కాలనీకి చెందిన రాయవరపు ముత్యాలనాయుడు నాలుగో ర్యాంకు సాధించారు.

మహిళా డిగ్రీ కళాశాలకు మోక్షమెప్పుడు?

అరకులోయలో ఐదేళ్లయినా పూర్తి కాని భవన నిర్మాణాలు

బిల్లులు చెల్లింపులో జాప్యంతో మందకొడిగా పనులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోని ప్రజాప్రతినిధులు

- కో-ఎడ్యుకేషన్ కళాశాలలో తరగతుల నిర్వహణ
- చాలీచాలని భవనాల్లో విద్యార్థినుల ఇక్కట్లు
- మెయిన్ బ్లాక్ పనులు పూర్తి చేశామంటున్న అధికారులు
- కొనసాగుతున్న హాస్టల్ భవనం పనులు
- కూటమి ప్రభుత్వం రాకతో చిగురిస్తున్న ఆశలు



నిర్మాణంలోనే ఉన్న మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల వసతిగృహం

అరకులోయ, జూన్ 18:

అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు ఐదేళ్లుగా సాగుతునే ఉన్నాయి. నిధులు విడుదలలో జాప్యం కావడంతో పనులు మందకొడిగా సాగాయి. కరోనా ప్రభావంతో రెండేళ్లు పనులు నిలిచిపోయాయి. ఇప్పటికి మెయిన్ బ్లాక్ పనులు పూర్తయ్యాయి. వసతి గృహం పనులు ఇంకా జరుగుతున్నాయి.

అరకులోయలో మహిళా డిగ్రీ కళాశాల భవనాలకు 2019 ఫిబ్రవరి 3వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌లో శంకుస్థాపన చేశారు. ఈ కళాశాలకు రూసా నిధుల నుంచి రూ.12 కోట్లు మంజూరు చేశారు. శంకుస్థాపన చేసిన రోజే కళాశాల బ్యాంకు ఖాతాకు రూ.6 కోట్లు జమ చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు పాణిరంగిణి-కరసాలగుడ గ్రామాల మధ్య ఉన్న మెట్టపైన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని మహిళా కళాశాలకు కేటాయించారు. ఏడాదిలోగానే పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ రెండేళ్లు కరోనా ప్రభావంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం పనులు జోరుగా జరిగినప్పటికీ చేపట్టిన పనులకు సంబంధించి రెండో విడత నిధులు విడుదలలో తీవ్ర జాప్యం అయ్యింది. దీంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళా కళాశాల భవన పనులపై ఎమ్మెల్యే గాని, ఎంపీ గానీ పట్టించుకోలేదు.ఈ భవన నిర్మాణ పనులు ఎలా జరుగుతున్నాయన్న అంశంపై కనీసం సమీక్ష కూడా చేయకపోవడం, బిల్లులు కోట్ల రూపాయల్లో బకాయిలు పేరుకుపోవడం జాప్యానికి కారణమని అంటున్నారు. 2024-25 విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ మెయిన్ బ్లాక్ మాత్రమే పూర్తయింది. తాజాగా ఈ కళాశాలకు రూ. రెండు కోట్లు విడుదల చేయడంతో హాస్టల్ భవనం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈభవనం అందుబాటులోకి వచ్చేందుకు రెండు,మూడు నెలలు పట్టే అవకాశం ఉంది. భవనాలు అందుబాటులోకి రాకపోవడంపై విద్యార్థినులు, తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నూతనంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కళాశాల భవన నిర్మాణాలు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకువస్తుందని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కో-ఎడ్యుకేషన్ కళాశాలలో తరగతుల నిర్వహణ

భవనాలు లేకపోవడంతో కో-ఎడ్యుకేషన్ కళాశాలలో మధ్యాహ్నం వేళలో మహిళా కళాశాల తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఫైనలియర్ విద్యార్థినులు పరీక్షలు రాసి వెళ్లిపోయారు. కళాశాలలో ఉన్న ఆరు గ్రూపులకు ప్రస్తుతం 500 మంది విద్యార్థినులు ఉన్నారు. మొదటి సంవత్సరం ప్రవేశాలు జరిగితే మరో 300 మంది విద్యార్థినులు చేరే అవకాశం ఉంది. కో-ఎడ్యుకేషన్ కళాశాలలో 8 గ్రూపులున్నాయి. ఆ కళాశాలలో 900 మందికిపైగా ఉన్నారు. అక్కడ భవనాలు ఆ కళాశాల విద్యార్థులకే సరిపడడం లేదు. అరకొర తరగతి గదుల మధ్య వారు ఇబ్బందులు పడుతుండగా.. మహిళా కళాశాల విద్యార్థినులకు ఇదే కళాశాలలో తరగతులు నిర్వహిస్తుండడంతో రెండు కళాశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ... మిగతా 8వ పేజీలో

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన పెంచాలి

అధికారులకు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశం

- ఏర్పాట్లు పరిశీలించిన పీవో
- అన్ని మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలి
- నేడు ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం



అధికారులకు సూచలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ప్రజలకు సికిల్ సెల్ ఎనీమియాపై మరింతగా అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. జిల్లా కేంద్రం పాడేరులో బుధవారం సికిల్ సెల్‌పై అవగాహనకు నిర్వహించే సదస్సు, ర్యాలీ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 9.30 గంటలకు అంబేడ్కర్ కూడలి నుంచి ఇండోర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో సికిల్ సెల్ ఎనీమియా నివారణపై సదస్సు జరుగుతుందన్నారు. 0నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన వారికి సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే బుధవారం ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఐటీడీఏ సమావేశ మందిరంలో సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

అలాగే ఏజెన్సీలోని అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమన్వయంతో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని పీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్.ప్రభాకరావు, ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ సాధన, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ డీఈఈ పి.అనుదీప్, తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి, ఎంపీడీవో సాయినవీన్, సీడీపీవో ఝాన్సీరాణి, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం రీమలి జాన్, తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



చింతపల్లి మండలం లంబసింగి జడ్పీ హైస్కూల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నిరుద్యోగులు

8

నేను బడికి పోతా..



'నేను బడికి పోతా'.. కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాడేరు మండలం సుండ్రుపుట్టులో బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించిన డీఈవో పి.బ్రహ్మాజీరావు ఎంఈవో, ఉపాధ్యాయులు

తాగునీటికి కటకట

ఊటగెడ్డ నీరు తాగుతున్న చెక్కరాయిబంద ఆదివాసీలు

- వ్యాధుల బారిన పడుతున్నవైనం
- గ్రామంలో నీటి పథకం, బోర్లు, బావులు లేవు
- వైసీపీ పాలకులు, అధికారులకు వినతులిచ్చినా పట్టించుకోలేదని గ్రామస్థుల ఆవేదన
- కూటమి ప్రభుత్వంలో మేలు జరుగుతుందని ఆశాభావం



ఊటగెడ్డ వద్ద కలుషిత నీరును పట్టుకుంటున్న గిరిజనులు

చింతపల్లి, జూన్ 18: మండలంలోని లంబసింగి పంచాయతీ చెక్కరాయిబంద గ్రామంలో ఆదివాసీలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఆదివాసీలు గ్రామ శివారులోని ఊటగెడ్డ నీరు తెచ్చుకుని తాగుతున్నారు. దీంతో తరచూ వ్యాధులకు గురవుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో 50 ఏళ్ల క్రితం నుంచి 40 కుటుంబాలు నివాసముంటున్నాయి. గ్రామంలో తాగునీటి పథకం గాని, చేతి పంపు, బావులు లేవు. ఏళ్ల తరబడి గ్రామ శివారులోని ఊటగెడ్డ నీటిని తెచ్చుకుని వినియోగించుకుంటున్నారు. గతసారి టీడీపీ ప్రభుత్వం ఈ ఊట గెడ్డకు చుట్టూ కుండిని నిర్మించింది. అయితే వర్షాకాలంలో బురద నీరు వస్తున్నదని, తాగేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆదివాసీలు వాపోతున్నారు. ఈమేరకు వైసీపీ పాలకులకు పలుమార్లు తమ గోడును వినిపించుకున్నారు. అంతేకాకుండా అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. అయినా వారెవరూ పట్టించుకోలేదు. ఈ కారణంగా వర్షాకాలంలో ఆదివాసీలు కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం మారడం, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో పాటు గ్రామీణ నీటిపారుదల శాఖ మంత్రిగా పవన్ కల్యాణ్ బాధ్యతలు స్వీకరించనుండడంతో తమ తాగునీటి సమస్యలు తీరుతాయని ఆదివాసీలు ఆశగా ఎదురుచూస్తున్నామన్నారు. ఇప్పటికైన అధికారులు, నూతన పాలకులు ఆదివాసీల సమస్యను పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ కోరారు.

పెరిగిన విద్యుత్ డిమాండ్

అదనపు విద్యుదుత్పత్తి చేయాలని సీలేరు కాంప్లెక్స్‌కు గ్రిడ్ అధికారుల ఆదేశాలు

- డొంకరాయి పవర్ కెనాల్‌కు నీటి విడుదల 12 అడుగులకు పెంపు
- బలిమెల నుంచి 3 వేల క్యూసెక్కులు విడుదల



డొంకరాయి పవర్ కెనాల్‌లో 12 అడుగుల మేరకు నీటిని విడుదల చేసిన దృశ్యం



ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు ఎస్ఈ కేకేవీ ప్రశాంత్‌కుమార్

సీలేరు, జూన్ 18: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న నేపథ్యంలో గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని మంగళవారం నుంచి పెంచుతున్నట్టు ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ (సివిల్) కెకెవి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం జెన్‌కో కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యుదుత్పత్తి కోసం డొంకరాయి పవర్ కెనాల్‌లోకి 11 అడుగుల నుంచి 12 అడుగులకు మంగళవారం నుంచి నీటి విడుదలను పెంచామన్నారు. ప్రస్తుతం కెనాల్ నుంచి ఫోర్‌బైకు 3,866 క్యూసెక్కుల నీరు వెళుతుందని ఆయన తెలిపారు. డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతులు అనంతరం ఈనెల 10వ తేదీ నుంచి డొంకరాయి జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని ప్రారంభించి కెనాల్‌లోకి నీటిని విడుదల చేశామన్నారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో ఇప్పటి వరకు రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి జరుగుతున్నదని, గ్రిడ్ డిమాండ్ నేపథ్యంలో మరో యూనిట్‌ను కూడా వినియోగంలోకి తీసుకు వస్తున్నామని ఆయన తెలిపారు.

బలిమెల నుంచి అదనపు నీరు

సీలేరు కాంప్లెక్సు జలవిద్యుత్ కేంద్రాలకు నీరిందించే బలిమెల జలాశయం నుంచి ఆంధ్రా వాటాగా ప్రస్తుతం 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే ఆంధ్రాలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండడంతో పాటు ఇతర జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిన నేపథ్యంలో సీలేరు కాంప్లెక్సు నుంచి విద్యుదుత్పత్తిని పెంచాలన్న గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం బలమెల జలాశయం నుంచి ఆంధ్రా వాటాగా విడుదల అవుతున్న 1500 క్యూసెక్కుల నీటిని 3 వేల క్యూసెక్కులకు పెంచాలని ఒడిశా అధికార్లను కోరడంతో మంగళవారం నుంచి 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారన్నారు. ఈ నీటితో సీలేరు, డొంకరాయి, పొల్లూరు మూడు జల విద్యుత్ కేంద్రాల్లో పీక్‌లోడ్ అవర్స్‌లో గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు విద్యుదుత్పత్తిని చేస్తామని జెన్‌కో ఎస్ఈ తెలిపారు. సీలేరు కాంప్లెక్సులోని డొంకరాయి జలాశయంలో 5 టీఎంసీలు, బలిమెలలో ఏపీ వాటాగా 5 టీఎంసీలు కలిపి 10 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో ఎస్ఈ కేకేవీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

క్రైం... crime news

భార్య, ఇద్దరు పిల్లల అదృశ్యంపై ఫిర్యాదు

ఎలమంచిలి, జూన్ 18: ఆస్పత్రికి వెళుతున్నామని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన తన భార్య ఇద్దరు పిల్లలు కనిపించడం లేదని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం మంగళవారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మునిసిపాలిటీలోని పెద్ద గొల్లలపాలెం గ్రామానికి చెందిన ఈగల రవి అచ్యుతాపురం మండలం మడుతూరులోని ఓ పెట్రోలు బంకులో పనిచేస్తున్నాడు. ఈ నెల 15వ తేదీన అచ్యుతాపురం ఆస్పత్రికి వెళుతున్నామని చెప్పి అతని భార్య నూకరత్నం,కుమారుడు యశ్వంత్, తొమ్మిది నెలల చిన్నారి ఇంటి నుంచి వెళ్లారు. అయితే అప్పటి నుంచి కనిపించడం లేదని రవి ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

▸ మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన అల్లు దుర్గారావు

కోటవురట్ల, జూన్ 18: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం లింగాపురం వద్ద చోటుచేసుకుంది. దీనికి సంబంధించి కోటవురట్ల ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కోటవురట్ల మండలం జగ్గంపేట గ్రామానికి చెందిన అల్లు దుర్గారావు(26) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్యకు మూడు రోజుల క్రితం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో డెలివరీ అయ్యి పాపకు జన్మనిచ్చింది. భార్య, కుమార్తెను చూసేందుకు దుర్గారావు మంగళవారం కే.వెంకటాపురంలోని అత్తవారింటికి వచ్చాడు. అక్కడి నుంచి బైక్‌పై ఆస్పత్రికి బయలుదేరాడు. దారి మధ్యలో తిమ్మాపురం జంక్షన్ వద్ద తన అన్నయ్య అల్లు రమేశ్‌ను బైక్ ఎక్కించుకున్నాడు. లింగాపురానికి రెండు కిలో మీటర్ల దూరంలో కుంచా అప్పలనాయుడు పాకలు సమీపంలో రోడ్డు మలుపు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి అతివేగం గుర్తు తెలియని నాలుగు చక్రాల వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో దుర్గారావు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న రమేశ్ కుడిచేయి విరిగి పోగా పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. అతనిని 108 వాహనంపై కోటవురట్ల 50 పడకల ఆస్పత్రికి తరలించగా, మెరుగైనా వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నారు. దుర్గారావు మృతదేహాన్ని కోటవురట్ల ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా విశాఖ

▸ దేశవ్యాప్తంగా 30 నగరాలను గుర్తించిన రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ
▸ జాబితాలో 17వ స్థానంలో నగరం
▸ రాష్ట్రం నుంచి తిరుపతికి చోటు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి హాట్ స్పాట్‌గా ఉన్న 17 నగరాల్లో విశాఖపట్నం స్థానం సంపాదించుకుంది. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కాలరీస్ ఇండియా దేశంలోని 100కు పైగా నగరాలను సర్వే చేసి అందులో ఎక్కువగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉన్న 30 నగరాలను గుర్తించింది. అందులో 17 నగరాలైతే మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ పదిహేడు నగరాల్లో రెండు ఆంధ్రప్రదేశ్ నుంచే ఉండడం విశేషం. అందులో ఒకటి తిరుపతి కాగా మరొకటి విశాఖపట్నం. ఆయా నగరాల్లో మౌలిక వసతులు మెరుగు పరచడానికి, అభివృద్ధికి అనుగుణంగా కొత్త ప్రాజెక్టులను అక్కడి ప్రభుత్వాలు చేపట్టడం వల్ల రియల్ ఎస్టేట్ రంగం విస్తరించనుందని సంస్థ విశ్లేషించింది. చక్కటి హోటళ్లు, రిటైల్ మార్కెట్లు కూడా దీనికి దోహదపడతాయని వెల్లడించింది.

పెరుగుతున్న ఎంక్వయిరీలు

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత నగరంలో రియల్ ఎస్టేట్ రంగం కూడా ఊపిరి పీల్చుకుంది. అంతకు ముందు ప్రభుత్వం మూడు రాజధానులు అంటూ ప్రకటనలు గుప్పించి విశాఖపట్నంలో లేని బూమ్ క్రియేట్ చేయడానికి యత్నించింది. అమరావతిలో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలేలా చేసింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అమరావతిలో రెండున్నరేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తిచేస్తామని, విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని ప్రకటించడంతో అటు అమరావతి, ఇటు విశాఖపట్నం రెండు నగరాల్లోను ఫ్లాట్లు, ఇళ్ల స్థలాలను కొనుగోలు చేయడానికి చాలామంది ఆసక్తి చూపుతున్నారు. అయితే విశాఖపట్నంలో ఊహించని విధంగా పెరిగిపోయిన భూముల రేట్లు, ఫ్లాట్ల ధరలు ఏమైనా తగ్గుముఖం పడతాయా?...అని కొనుగోలుదారులు ఎదురుచూస్తున్నారు. నాలుగేళ్ల క్రితం విశాఖపట్నం నుంచి హైదరాబాద్, భువనేశ్వర్ వంటి నగరాలకు వెళ్లిపోయిన రియల్ ఎస్టేట్ సంస్థలు మళ్లీ విశాఖపట్నంలో ప్రాజెక్టులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

కూటమి కార్యకర్తలు తలెత్తుకునేలా చేస్తా

▸ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



ఎంపీ రమేశ్, ఎమ్మెల్యే పంచకర్లను సత్కరిస్తున్న కూటమి నాయకులు

పెందుర్తి, జూన్ 18: రాష్ట్రంలో సుస్థిరత ప్రభుత్వం ఏర్పాటుకు కూటమి కార్యకర్తలే కారణమని, వారి గౌరవం తగ్గకుండా తలెత్తుకునేలా చేస్తానని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. స్థానిక తాండ్రపాపారాయుడు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ కూటమి కార్యకర్తల ఆత్మీయ విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ కార్యకర్తల మనోభావాలను గుర్తిస్తామన్నారు. ఇతరులు కూటమిలో చేరుతారన్న ప్రచారం ఊహాజనితమని, ఎవరు పడితే వారు వచ్చి చేరేందుకు కూటమి ఏమీ డంపింగ్ యార్డు కాదని, తమది చారిత్రాత్మక పొత్తు అని అన్నారు. పెందుర్తిలో త్వరలో ఇల్లు కట్టుకుంటానని, ప్రజలకు సేవ చేసి వారి రుణం తీర్చుకుంటానన్నారు. కార్యకర్తలు పిలిస్తే పలుకుతానని, వారి సమస్యలను పరిష్కరించడం బాధ్యతగా తీసుకుంటానన్నారు.

ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ ఎంపీ సీఎం రమేశ్ పెద్దన్నలా వ్యవహరించడం వల్లే అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజవర్గాల్లో గెలుపు సాధ్యమైందన్నారు. పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అధికంగా నిధులు వెచ్చించవలసిందిగా కోరారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. అనంతరం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కోరుపోలు రాము నాయుడు ఆధ్వర్యంలో, ఎంపీ, ఎమ్మెల్యేలను పలువురు కూటమి నాయకులు గజమాలతో వేసి దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ నియోజవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, నాయకులు రెడ్డి నారాయణరావు, ముదునూరి రాజాసుధాకర్, అయిత సింహాచలం, సుఖవాసి అజయ్, గొర్లె అప్పారావు, జ్యోతి, పిస్నింటి పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

ఆరిలోవ రోడ్డు విస్తరణ పనులపై ఎమ్మెల్యే ఆగ్రహం

ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు

▸ నాణ్యతపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వండి
▸ బిల్లులు మంజూరు చేయవద్దు
▸ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



ఆరిలోవ రోడ్డు విస్తరణ పనులపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు

గొలుగొండ, జూన్ 18: ఆరిలోవ అటవీ ప్రాంతంలో నాలుగు కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత లోపించిందని నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆర్అండ్‌బీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరిలోవ అటవీ ప్రాంతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రోడ్డు విస్తరణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు రోడ్డు నిర్మాణాలు చేపట్టారా అని ఆరా తీశారు. అనంతరం రోడ్డు కొలతలు తీయించి పరిశీలించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు విలేకరులతో మాట్లాడుతూ తారు రోడ్డు పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు అప్పగించి, అనుభవం లేని కాంట్రాక్టర్‌తో పనులు చేయించారని అధికారులపై మండిపడ్డారు. 2018లో టీడీపీ హయాంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో నర్సీపట్నం నుంచి కృష్ణాదేవిపేట వరకూ 24 కిలోమీటర్ల మేర పనులకు రూ.24 కోట్లు మంజూరు చేశామన్నారు. 2019 ఎన్నికల్లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాలుగు కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు ఎన్నికల ముందు అటవీ శాఖ అనుమతులు తీసుకువచ్చిందని, సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆదరాబాదరాగా పనులు చేపట్టిందన్నారు. కల్వర్టుల నిర్మాణాలు చేపట్టకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం ఏమిటని అధికారులను నిలదీశారు. అలాగే రోడ్డుకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయవద్దని అధికారులను ఆదేశించారు. నాణ్యత లోపంపై వారం రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక అందించాలని ఆర్అండ్‌బీ శాఖాధికారులను ఆదేశించారు. దీనిపై సరైన సమాధానం చెప్పలేకపోతే అధికారులు సెలవులపై వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ కె.కాంతిమతి, పాడేరు ఈఈ పి.బాలసుందరబాబు, నర్సీపట్నం ఆర్అండ్‌బీ డీఈ నాగమోహన్, మండల జేఈ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సీహెచ్. తారకవేణుగోపాల్, టీడీపీ నాయకులు ఆదపురెడ్డి గోపాలకృష్ణ, భీమిరెడ్డి సత్యనారాయణ, కామిరెడ్డి గోవింద్, గెడ్డం సత్యనారాయణ, చిటికెల సాంబమూర్తి, లాలం కాశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డ స్థలం ఆక్రమించేశారా?

చోడపల్లి- కొండకర్లకు మధ్య మూడెకరాలను రియల్టర్ కబ్జా చేశారంటూ ఆరోపణలు

▸ గతంలో అది కొండ గెడ్డ అంటున్న గ్రామస్థులు
▸ పక్కా జిరాయితీ అని చెబుతున్న వీఆర్వో



కొత్తగా నిర్మిస్తున్న ప్రహరీని ఆనుకొని ఉన్న కొండ గెడ్డ

అచ్యుతాపురం, జూన్ 18: చోడపల్లి- కొండకర్లకు మధ్య సుమారు మూడెకరాల గెడ్డ పోరంబోకు భూమి ఆక్రమణకు గురైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓ రియల్టర్ దానిని ఆక్రమించుకొని చదును చేస్తున్నాడని చోడపల్లి గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయితే ఇది పక్కా జిరాయితీ భూమి అని కొండకర్ల వీఆర్వో సింహాచలం నాయుడు అంటున్నారు.

చోడపల్లి జగనన్న కాలనీని ఆనుకొని గెడ్డ పోరంబోకు ఉండేది. వర్షాలకు ఈ గెడ్డ నుంచి నీరు ప్రవహించి కొంత కొండకర్ల చెరువులోకి, మరికొంత ఎర్రవరం చెరువులోకి వెళ్లేది. ఈ ప్రాంతంలో తాము పశువులను మేపుకొనే వాళ్లమని, అయితే ఇప్పుడు ఈ గెడ్డను గ్రావెల్‌తో నింపి ప్రహరీ నిర్మిస్తున్నారని చోడపల్లి గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో ఒక రియల్టర్ చోడపల్లి కొండ నుంచి కొండకర్ల వరకు భూములను కొని భారీ స్థాయిలో ప్రహరీ నిర్మించుకున్నారు.



గ్రావెల్ వేసి చదును చేసి ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం

ఈ గెడ్డ ప్రాంతాన్ని మాత్రం వదిలేశాడు. ప్రస్తుతం పాత ప్రహరీని ఆనుకొని ఉన్న గెడ్డ పోరంబోకును గ్రావెల్‌తో కప్పి కొత్తగా ప్రహరీని నిర్మిస్తున్నాడని, తమ పశువులను కూడా అందులోకి రానివ్వడం లేదని చోడపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇది పక్కా జిరాయితీ అని కొండకర్ల వీఆర్వోవో సింహాచలం నాయుడు తెలిపారు. గతంలో ఒక రియల్టర్ చోడపల్లి, కొండకర్ల మధ్య సుమారు 27 ఎకరాలు భూమిని కొనుగోలు చేసి చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నాడు. ప్రస్తుతం గోడ కడుతున్న భూమి కూడా సర్వే నంబరు 102 పరిధిలో ఉంది. గతంలో దీని నుంచి కొండగెడ్డ ప్రవహించినప్పటికీ అది డీపట్టా భూమి. జగన్ ప్రభుత్వం డీపట్టా భూములను జిరాయితీగా మార్పు చేస్తూ జీవో విడుదల చేయడంతో రియల్టర్ దీనిని జిరాయితీగా మార్పు చేసిన తరువాత పక్కా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. గెడ్డ మాత్రం సర్వే నంబరు 103లో ఉందని వీఆర్వో తెలిపారు.

చోడవరం సీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే బాలింత, బిడ్డ మృతి

▸ బాలింత కుటుంబ సభ్యుల ఆరోపణ
▸ చీడికాడ, తునివలస గ్రామాల్లో విషాదం



బత్తిన హేమకుమారి (ఫైల్)

చీడికాడ, జూన్ 18: చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సిబ్బంది నిర్లక్ష్యం వలనే బాలింత హేమకుమారి, బిడ్డ మృతిచెందారని బాలింత భర్త బత్తిన ప్రతాప్, మామ బత్తిన ఎర్రన్న రోదిస్తూ ఆరోపించారు. ఇందుకు సంబంధించి వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలో తునివలస గ్రామానికి చెందిన హేమకుమారి(19)కు చీడికాడలో ఉన్న బత్తిన ప్రతాప్‌తో ఏడాది క్రితం వివాహం జరిగింది. ఆమె 9వ నెల గర్భిణి కావడంతో గత శుక్రవారం చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. అక్కడ హేమకుమారిని తనిఖీ చేసిన వైద్యాధికారులు డెలివరీ సమయమని, మీరు ఇక్కడే ఉంచాలని ఆదేశించారు. దీంతో హేమకుమారిని చోడవరం సీహెచ్‌సీలో ఉంచారు. శుక్రవారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకూ వైద్యపరీక్షలు చేసిన వైద్యాధికారి, సిబ్బంది డెలివరీ కాలేదని, వెంటనే అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించాలని సిఫార్సు చేయడంతో 108లో కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ తనిఖీ అనంతరం కడుపులో చనిపోయిన బిడ్డని ఆపరేషన్ చేసి తీశారన్నారు. అయితే బాలింతకు అధిక రక్తస్రావం కావడంతో వెంటనే కేజీహెచ్‌కు తరలించాలని ఆదేశించడంతో 108లో ఆదివారం మధ్యాహ్నం కేజీహెచ్‌కు కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 8గంటల సమయంలో బాలింత హేమకుమారి మృతి చెందినట్టు విశాఖ కేజీహెచ్ వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు తెలిపారు. చోడవరం సీహెచ్‌సీ సిబ్బంది రెండు రోజులు గర్భిణిని ఇక్కడ ఉంచి, పరిస్థితి విషమించాక అనకాపల్లి పంపారని, దీనికి వారే కారకులని కుటుంబ సభ్యులు విలేకరులకు తెలిపారు. బిడ్డ, బాలింత మృతితో చీడికాడ, తునివలస గ్రామాల్లో విషాదం నెలకొంది.

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు

అనకాపల్లి టౌన్, జూన్ 18: రాగల ఐదు రోజుల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి నుంచి ఓ మోస్తరుగా వర్షాలు కురిసే అవకాశముందని స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. మంగళవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఐదు రోజులు ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 33.8 నుంచి 36.6 డిగ్రీల సెల్సియస్‌గా ఉండవచ్చునని తెలిపారు. వరి పైరు వేసుకునే రైతులు రాగల వర్షాలను వినియోగించుకుని వరినారుకు నేల తయారు చేసుకోవాలన్నారు. అధిక దిగుబడులకు ఆర్‌జీఎల్-2537 వరి రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 1262 రకాలను, అలాగే ఎంటీయూ 7029కి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318 రకాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. వరినారు మడిలో ఆకు ఎండు తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్తగా గట్ల మీద ఉన్న కలుపు మొక్కలను తీసివేయాలని సూచించారు. మొక్కజొన్నను సాగు చేసే రైతులు రాగల ఐదు రోజుల్లో వర్షసూచన ఉన్నందున సద్వినియోగం చేసుకుని ఖరీఫ్ మొక్కజొన్న పంటకు నేల దున్ని తయారు చేసుకుని అధిక దిగుబడినిచ్చే డీహెచ్ఎం-117, డీహెచ్ఎం-119, డీహెచ్ఎం-121 వంటి రకాలను ఎకరాకు ఎనిమిది కిలోల చొప్పున విత్తుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎం.విశాలాక్షి, డాక్టర్ వి.గౌరీ, డాక్టర్ సీహెచ్ సీతారామలక్ష్మి, డాక్టర్ వి.చంద్రశేఖర్, డాక్టర్ పీవీ పద్మావతి, డాక్టర్ ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా గంటి నాట్లు

▸ మండలంలో పెరిగిన సాగు విస్తీర్ణం
▸ రైతులకు లాభదాయంగా ఉన్న సజ్జలు
▸ గ్రామాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు
▸ సాగుకు ఆసక్తి కనబరిచిన రైతులు



మల్లునాయుడుపాలెంలో గంటి నాట్లు(సజ్జ) వేస్తున్న రైతులు

సబ్బవరం, జూన్ 18: మండలంలోని పలు గ్రామాల్లో గంటి(సజ్జలు) నాట్లు జోరుగా సాగుతున్నాయి. శనివారం, ఆదివారం వర్షాలు కురవడంతో మలునాయుడుపాలెం, గుల్లేపల్లి, మొగలిపురం, సబ్బవరం, గొర్లివానిపాలెం, తవ్వవానిపాలెం, అంతకాపల్లి, రాయపుర అగ్రహారం, అమృతపురం, అసకపల్లి, పైడివాడ, గొల్లలపాలెం తదితర గ్రామాల్లో రైతులు గంటి నాట్లు వేస్తున్నారు. గతం కంటే గంటి సాగు విస్తీర్ణం పెరిగనట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 1200 ఎకరాల్లో గంటి నాట్లు వేసే అవకాశం ఉన్నట్టు వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ తెలిపారు.

ఇటీవల గంటి వినియోగం పెరిగింది. పల్లెలతో పాటు పట్టణ ప్రజలు గంటి వినియోగం పెంచారు. గంటిలో పీచు పదార్థం అధికంగా ఉండడంతో పాటు పోషక విలువలు ఉన్నట్టు ప్రచారం జరుగుతుండడంతో పూర్వవైభవం సంతరించుకుంటోందని పలువురు రైతులు చెబుతున్నారు. ఇటీవల వస్తున్న ఆహార మార్పులతో తృణ ధాన్యాల వినియోగం పెరిగింది. దీంతో గంటికి గిరాకీ పెరిగింది. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా వినియోదారులు మారుమూల గ్రామాలకు వెళ్లి గంట్లెను కొనుగోలు చేస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు కూడా గంటిలను కొనుగోలు చేసేందుకు గ్రామాల బాట పడుతున్నాయి. దీంతో కిలో రూ.60 నుంచి రూ.70 ఉండే గంటిలు.. ఇప్పుడు గ్రామాల్లో కిలో రూ. 90 నుంచి రూ. 100 వరకూ కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు గంటి సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

పెరిగిన విస్తీర్ణం

గంటి సాగు లాభదాయకంగా ఉండడంతో మండలంలో సాగు విస్తీర్ణం పెరిగింది. ఐదేళ్ల క్రితం 600 ఎకరాల్లో గంటి పంటను సాగు చేసేవారు. ఈ ఏడాది 1200 ఎకరాలకు పెరిగిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తే సాగు విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

రైలులో హోం మంత్రి అనిత ప్రయాణం

▸ వందే భారత్ రైలులో విశాఖ నుంచి విజయవాడకు ..



వందే భారత్ రైలులో ప్రయాణికులతో హోం మంత్రి అనిత

నక్కపల్లి, జూన్ 18: రాష్ట్ర హోం మంత్రిగా వంగలపూడి అనిత బాధ్యతలు చేపట్టిన మరుక్షణం నుంచి పాలనలో తనదైన మార్క్ కనిపించేలా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష కూడా నిర్వహించి, శాంతి భద్రతల పరిరక్షణ, మహిళల భద్రతకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే మంగళవారం ఒక సాధారణ ప్రయాణికురాలిగా ఆమె వందే భారత్ రైలులో విజయవాడ వెళ్లారు. విశాఖ నుంచి మంగళవారం ఉదయం వందేభారత్ రైలులో ప్రయాణిస్తూ తోటి ప్రయాణికులను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులు ఆమెతో ఫొటోలు దిగారు. రైలు ప్రయాణికులకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు వస్తే వాటిని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకు వెళతానని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు.

జూలై 18 లోపు అన్న క్యాంటీన్ సిద్ధం చేయండి

▸ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం అన్న క్యాంటీన్ భవనంలో బోర్డులను పరిశీలిస్తున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూన్ 18: అన్న క్యాంటీన్ భవనాన్ని జూలై 18 తేదీలోపు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం మరమ్మతులు చేస్తున్న అన్న క్యాంటీన్ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మాదిరిగానే భవనానికి రంగులు వేయించాలని సూచించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేదవాడికి రూ.5లకు భోజనం పెట్టాలన్న ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు పెట్టారని, సైకో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత వాటిని మూసేసి, పేదవారి పొట్ట మీద కొట్టారని విమర్శించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు, డీఈఈ నారాయణ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణ నా బాధ్యత

▸ తొలి, తుది లక్ష్యం అదే...
▸ యాజమాన్యంతో చర్చించిన అనంతరం కేంద్రం ముందు మా ప్రతిపాదనలు ఉంచుతాం
▸ ఎంపీ శ్రీభరత్ సహకారంతో కర్మాగారానికి సొంత గనులు కేటాయింపునకు కృషి చేస్తాం
▸ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



రిలే దీక్షల్లో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత

కూర్మన్నపాలెం, జూన్ 18: స్టీల్‌ప్లాంటు పరిరక్షణ తన ప్రధాన బాధ్యత అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరానికి విచ్చేసి, సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉక్కు కార్మికులకు అన్నివిధాలా సహాయ సహకారాలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గర్భాం మాంగనీస్ గనులు, కింతాడ క్వార్ట్జ్ మైన్స్, సారిపల్లి ఇసుక రీచ్‌లు నెలలోగా స్టీల్‌ప్లాంటుకు రెన్యువల్ చేస్తామని హామీ ఇచ్చారు. విశాఖ స్టీలుప్లాంటును భావి తరాల వారికి అందించడమే తన తొలి, తుది లక్ష్యమన్నారు. ఈ నెల 24వ తేదీలోపు విశాఖ ఎంపీ ఎం.శ్రీ భరత్‌తో కలిసి స్టీలుప్లాంటు యాజమాన్యంతో చర్చించి ఓ ప్రణాళికను తయారుచేసుకొని, కేంద్ర ప్రభుత్వం ముందు తమ ప్రతిపాదనలు ఉంచుతామన్నారు. ఎంపీ శ్రీభరత్ సహకారంతో విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయింపునకు కృషి చేస్తామన్నారు. స్టీలుప్లాంటు ప్రైవేటీకరణ సమస్యను పరిష్కరించేంత వరకూ అవిశ్రాంత పోరాటాలకు ఉక్కు కార్మికులతో కలసి ఉంటానని హామీ ఇచ్చారు. ఉక్కు కర్మాగారం కోసం భూములిచ్చిన నిర్వాశితులకు అన్యాయం జరగనివ్వబోమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, కార్పొరేటర్లు బొండా జగన్, మొల్లి ముత్యాలునాయుడు, పల్లా శ్రీనువాస్, నిర్వాసిత నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, కేఎస్ఎన్ రావు, విల్లా రామ్మోహన్‌కుమార్, జెర్రిపోతుల ముత్యాలు, గంధం వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు రుణ పడి ఉంటాం..

›› సీఎం చిత్రపటానికి లంబసింగి నిరుద్యోగ యువత పాలాభిషేకం

చింతపల్లి, జూన్ 18: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చుతూ మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడకు రుణపడి ఉంటామని లంబసింగి గిరిజన నిరుద్యోగ యువత అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు డీఎస్సీ ప్రకటిస్తామంటూ కాలయాపన చేసిందన్నారు. డీఈడీ, బీఈడీ, ఎంఈడీలు పూర్తి చేసి ఐదేళ్లపాటు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నామన్నారు. ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ తీస్తామని హామీ ఇచ్చి, చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజే మెగా డీఎస్సీపై సంతకం చేయడం అభినందనీయమన్నారు. మెగా డీఎస్సీలో తామంతా ఉద్యోగాలు సాధిస్తామనే ఆశ ఉన్నదన్నారు. అలాగే జీవో నంబరు-3 పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామి ఇచ్చారని, ఈజీవోను పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో ప్రత్యేక డిఎస్సీ తీయాలని కోరారు.

సీఎం చంద్రబాబును కలిసిన గిడ్డి ఈశ్వరి


సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గిడ్డి ఈశ్వరి

పాడేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మంగళవారం అమరావతిలో పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఏజెన్సీలోని ఎన్నికల ఫలితాలపై పలు అంశాలను ఆయనకు ఈశ్వరి వివరించారు. ఓటమి నేపథ్యంలో ఎటువంటి అధైర్యం, నిరుత్సాహం వద్దని కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున చక్కని భవిష్యత్ ఉంటుందని చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారని గిడ్డి ఈశ్వరి తెలిపారు. చంద్రబాబునాయుడు తనతో ఎంతో ఉత్సాహంగా మాట్లాడారని ఈశ్వరి ఆనందం వ్యక్తం చేశారు.

మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి గిరిజనుల రేషన్ కష్టాలు



రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్‌ను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మంగళవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా గిరిజన ప్రాంతంలో గిరిజనులు పడుతున్న రేషన్ కష్టాలు, జీసీసీ పనితీరు తదితర అంశాలను మంత్రికి ఆమె వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఈ సందర్భంగా మంత్రి మనోహర్ హామీ ఇచ్చినట్టు గిడ్డి ఈశ్వరి తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన వినియోగదారుల సమాఖ్య ప్రతినిధులు


కలెక్టర్ ఎం.విజయసునీతను కలిసిన వినియోగదారుల సంఘాల ప్రతినిధులు

పాడేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీతను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తమ సమాఖ్య ద్వారా వినియోగదారులకు అందిస్తున్న సేవలను కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు బి.చిట్టిబాబు, కె.రమేశ్, సభ్యులు, పలు కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలను వినియోగించుకోండి


రాయితీ విత్తనాలను అందజేస్తున్న టీడీపీ సీనియర్ నేత సత్యనారాయణ పడాల్

చింతపల్లి, జూన్ 18: గిరిజన రైతులు రాయితీ విత్తనాలను సద్వినియగం చేసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు బేరా సత్యనారాయణ పడాల్ సూచించారు. మండలంలోని యర్రబొమ్మలు పంచాయతీ ముల్లుమెట్ట ఆర్‌బీకే కేంద్రం వద్ద మంగళవారం రైతులకు రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలను ఆర్‌బీకేలకు పంపించడం జరిగిందన్నారు. ప్రస్తుతం వరిలో ఆర్‌జీఎల్ 2537, ఆర్ఎన్ఆర్ 15058, ఎంటీయూ 1013, ఎన్ఎల్ఆర్ 34449, ఎంటీయూ 1156, ఎంటీయూ 1064, ఎంటీయూ 1318, వేరుశనగ లేపాక్షి రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యర్రబొమ్మలు సర్పంచ్ లోత పండయ్య, ఎంపీఈవో ప్రమీళ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ఆక్రమిత భూములను స్వచ్ఛందంగా అప్పగించండి: తహసీల్దార్ రామకృష్ణ


లోతుగెడ్డ జంక్షన్‌లో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కట్టడాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

చింతపల్లి, జూన్ 18: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక తహసీల్దార్ టి.రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని లోతుగెడ్డ జంక్షన్ సంతబయలు వద్ద ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని చేపడుతున్న నిర్మాణాలను తహసీల్దార్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడే బాధ్యత రెవెన్యూ ఉద్యోగులతో పాటు ప్రజలపై కూడా ఉందని చెప్పారు. గ్రామ కంఠం, పోరంబోకు, ప్రభుత్వ స్థలాలపై సర్వే చేపట్టాలని వీఆర్వోలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గిరిజనులు, గిరిజనేతరులు నిర్మాణాలు చేపట్టినా నేరమేనన్నారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలపై వీఆర్వోలు నివేదిక రూపొందిస్తున్నారన్నారు. ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి తొలగిస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వ్యక్తులు స్వచ్ఛందంగా తిరిగి అప్పగించాలన్నారు. లేదంటే ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రధాన మార్గం.. మురికి కూపం!

- ›› చినుకుపడితే నాలుగు రోడ్ల కూడలి చిత్తడి
- ›› డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం.. అంతా మురుగుమయం
- ›› కానరాని సీసీ రోడ్లు... ప్రజల ఇబ్బందులు
- ›› పాదచారులు, నివాసితులకు తప్పని అవస్థలు
- ›› పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- ›› ముంచంగిపుట్టు మండల కేంద్రంలో దుస్థితి!


వర్షం పడే సమయంలో ముంచంగిపుట్టు ప్రధాన రహదారిపై ఏరులై పారుతున్న నీరు

కాలం శరవేగంగా మారుతోంది.. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ వృద్ధి చెందుతోంది.. కాని, గిరిజనుల జీవన గమనం మాత్రం అడుగు కూడా ముందుకు పడనంటోంది.. ఈ ఆధునిక యుగంలోనూ కనీస సదుపాయాలకు నోచుకోలేక ప్రత్యక్ష నరకం అనుభవించాల్సి వస్తోంది. అది కూడా మండల కేంద్రమైన ముంచంగిపుట్టులోనే ఈ సమస్యలు వేధిస్తుండడం విచారకరం.

ముంచంగిపుట్టు, జూన్ 18:

మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అవస్తవ్యస్తంగా ఉంది. ఫలితంగా చిన్నపాటి చినుకుపడితే చాలు ప్రధాన జంక్షన్‌తో పాటు ఇళ్ల ఇరువైపులా అధ్వానంగా మారుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలి ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న డ్రైనేజీలు దెబ్బతినడం, పలు చోట్ల డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే అత్యంత దయనీయ దుస్థితి దాపురిస్తోంది.

ముంచంగిపుట్టు నాలుగు రోడ్ల కూడలి నుంచి వెటర్నరీ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో రహదారి ఇరువైపులా డ్రైనేజీ దెబ్బతింది. అలాగే జీసీసీ గొడౌన్‌కు వెళ్లే మార్గంలో ఉన్న అరకొర డ్రైనేజీ మరమ్మతులకు గురైంది. దీంతో రహదారులపైనే చెత్త, మురుగునీరు పేరుకుపోతుంది. వీధుల్లో సైతం డ్రైనేజీ సదుపాయం లేకపోవడం ఉన్న డ్రైనేజీలు దెబ్బతినడం వాటి మరమ్మతుపనులపై అధికారులు కనీసం దృష్టిశారించకపోవడంతో వర్షా కాలంలో స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు. డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో పలు చోట్ల మురుగు నీరు రహదారులపై నిల్వ ఉండిపోతుంది. దీంతో దుర్గంధం వెదజల్లుతుంది. సంతబయలు ప్రాంతంలో మరీ అధ్వానంగా ఉంటుంది. అటుగా వెళ్లే పాదచారులు ముక్కునవేలు వేసుకుంటేగానీ రాకపోకలు సాగించలేని దుస్థితి. గత కొద్ది రోలుగా కురిసిన వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో దుర్గంధంతో పాటు దోమలు ఉత్పత్తి అధికమైంది. దీంతో పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు సంబంధిత అధికారులు, పాలకులు తక్షణమే తగిన చొరవ చూపాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

అప్పలకొండ మృతి కేసుపై విచారణ చేపట్టాలి

- ›› బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుర్ల అప్పారావు
- ›› వల్లాపురంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన


బీఎస్పీ నాయకుడితో కలిసి నిరసన తెలుపుతున్న మృతుడి కుటుంబ సభ్యులు

పాడేరు రూరల్, జూన్ 18: మండలంలోని డోకులూరు పంచాయతీ వల్లాపురం గ్రామానికి చెందిన పాంగి అప్పలకొండ (32) అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుర్ల అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మృతుని కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం వల్లాపురం గ్రామంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అప్పలకొండది సహజ మరణం కాదన్నారు. అదే గ్రామానికి చెందిన బోయిన బాలకృష్ణ హత్య చేసి ఉంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, బాలకృష్ణపై ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న మృతుని భార్య కృష్ణకుమారి, కుటుంబ సభ్యులను విచారణ పేరుతో గత వారం రోజులుగా పోలీసు స్టేషన్‌కు ప్రతీ రోజు రప్పించి బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. స్వయంగా హత్య చేసినట్టు అంగీకరించాలని పోలీసులు వేధింపులకు గురిచేయడం అన్యాయమన్నారు. అప్పలకొండ ఈ నెల 4వ తేదీ నుంచి కనిపించక పోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లేకపోవడంతో భార్య కృష్ణకుమారి, కుటుంబ సభ్యులు ఈ నెల 8వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు చేసిన రెండు రోజుల తరువాత గ్రామ సమీపంలోని గెడ్డ వద్ద తుప్పల్లో అప్పలకొండ మృతదేహాన్ని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారని చెప్పారు. దీంతో విచారణ చేపడుతున్న పోలీసులు మృతుడు అప్పలకొండకు అదే గ్రామానికి చెందిన బాలకృష్ణకు పాత కక్షలు ఉన్నాయన్నారు. వారి మధ్య ఘర్షణలు జరిగితే డిసెంబరు 2022లో పాడేరు పోలీసు స్టేషన్‌లో బైండోవర్ కూడా చేశారన్నారు. అప్పలకొండ మృతికి బాలకృష్ణ కారణమని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చెపుతున్న నేపథ్యంలో పోలీసులు స్పందించి గ్రామంలో ప్రజలను సమగ్రంగా విచారించి హత్యకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేస్తామని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయల ప్రదర్శన

జి.మాడుగుల, జూన్ 18: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వివిధ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ గోపాలక్రిష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వ్యవసాయ భూములు కలిగిన రైతులు సేంద్రీయ ఎరువులు ద్వారా ఆరోగ్యకరమైన పంట పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా భీరం, నుర్మతి సొలభం తదితర పంచాయతీలను నుంచి విక్రయాలకు తెచ్చిన కూరగాయాలను ప్రదర్శన నిర్వహించి ప్రజలు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సుందరమ్మ, ప్రకృతి వ్యవసాయ యూనిటీ ఇన్‌చార్జులు ఎం.ప్రసాద్, రామలింగం, వెలుగు సిబ్బంది పల్గొన్నారు.

ఏపీ హంస మండల నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన హంస మండల కమిటీ నాయకులు

చింతపల్లి, జూన్ 18: ఏపీ హంస (హెచ్ఏఎంఎస్ఏ) మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు కమిటీ మండల అధ్యక్షుడిగా కుడుముల రామకృష్ణ ఎన్నికైనట్టు జోనల్ కోఆర్డినేటర్ డి.సూరిబాబు తెలిపారు. మంగళవారం చింతపల్లి తాలూక పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హంస మండల నూతన కార్యవర్గాన్ని ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శిగా పి.సుమసుందర్, కోశాధికారిగా బీవీఎం రాణిని ఎన్నుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు లోత సావిత్రి, ప్రధాన కార్యదర్శి కె.సరస్వతి, ఎన్నికల అధికారులు టీవీవీ సత్యనారాయణ, ఎ. విజయకుమార్, మండల నాయకులు జాన్సన్, దేవమణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కానీయవద్దు'

పాయకరావుపేట, జూన్ 18 : మండలంలోని వెంకటనగరం పంచాయతీ పరిధిలోని రాజానగరం గ్రామం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా సంరక్షించాలని పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్థులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తహసీల్దారు సూర్యనారాయణకు మంగళవారం పంచాయతీ వార్డు సభ్యుడు పారా గాలిబాబు తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం గాలిబాబు తదితరులు మాట్లాడుతూ సుమారు మూడు శతాబ్దాల నుంచి రాజానగరం పరిధిలో గ్రామం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు, ఉప్పుటేరు, శ్మశానం కబ్జాలకు గురవుతోందని ఆరోపించారు. ఉప్పుటేరు ఆక్రమణ పాలవుతున్నందున వరదల సమయంలో గ్రామం ముంపు బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాజానగరం గ్రామంలో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములను గుర్తించి ఆక్రమణలు తొలగించడంతో పాటు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గరికిన అప్పారావు, వంకా బాబ్జీ, కోడా జగన్నాథం, ఓసిపల్లి కొర్లయ్య, పారా జగ్గ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ప్రత్యేక పూజలు

గిరిజనుల సంప్రదాయలతో పండుగ ముగింపు


శతకంపట్టుకు ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

హుకుంపేట, జూన్ 18: మోదకొండమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి పండుగను మంగళవారం సంప్రదాయంగా ముగించారు. ఆఖరి రోజు భక్తులు ప్రత్యేక ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి పూజలు నిర్వహించారు. శంతకపట్టు వద్ద నుంచి అమ్మవారి ఘటాలతో ప్రతీ వీధిలోనూ ఊరేగింపు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పండుగలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అలాగే జాతర ప్రశాంతంగా ముగియడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.

మహిళా డిగ్రీ కళాశాలకు మోక్షమెప్పుడు..?

... 5వ పేజీ తరువాయి


అందుబాటులోకి రాని అరకులోయ మహిళా డిగ్రి కళాశాల భవనం

మహిళా కళాశాల భవనాలు అందుబాటులోకి వస్తే రెండు కళాశాలల విద్యార్థులకు భవన సమస్య తీరుతుంది. ఈ దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మెయిన్ బ్లాక్ సిద్ధం చేశాం..
రెండు నెలల్లో హాస్టల్ భవనాల పనులు పూర్తి
-సన్యాసయ్య, డీఈఈ

అరకులోయ మహిళా కళాశాల మెయిన్ బ్లాక్ పనులు పూర్తి చేశాం. కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈ సమాచారం అందించాం. బ్లాక్‌లో 17 గదులతోపాటు నాలుగు ల్యాబ్‌లు, గ్రంథాలయం, కాన్ఫరెన్స్ హాలు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, స్టాఫ్, ఆఫీస్‌రూమ్, స్టోర్‌రూమ్, టాయిలెట్స్ పనులు పూర్తి చేశాం. హాస్టల్ భవనం పనులు జరుగుతున్నాయి. మరో రెండు నెలల్లో ఈ భవనాన్ని, రహదారి, ఇతర పనులు పూర్తి చేస్తాం.

☛ సంక్షిప్తంగా..

బడి ఈడు పిల్లల గుర్తింపునకు ప్రత్యేక చర్యలు

జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజిరావు

పాడేరు రూరల్, జూన్ 18: బడి ఈడు పిల్లలను గుర్తించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజిరావు తెలిపారు. ఈ మేరకు 'నేను బడికి పోతా.. పిల్లలు బడిలో.. పెద్దలు పనిలో..' అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో భాగంగా పాడేరు మండలంలోని తొమ్మిది గ్రామాల్లో మంగళవారం చేపట్టిన న్యూ ఎన్రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో 35 మంది చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించామన్నారు. గుడివాడ పాఠశాలలో ఐదుగురు చిన్నారులను, సుండ్రుపుట్టులో నలుగురు, కిండంగిలో ముగ్గురు, నక్కలపుట్టులో ఒకరు, వర్తనాపల్లిలో ఐదుగురు, కాడెలిలో ఐదుగురు, లగిశపల్లిలో నలుగుఉరు, బర్సింగిలో నలుగురు, కొత్త డేగలవీధిలో నలుగురు చిన్నారులను గుర్తించామని, వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్య ప్రాముఖ్యతను వివరించి ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించామని డీఈవో వివరించారు. ఆరు నుంచి 14 ఏళ్ల లోపు బాలలంతా నిర్బంధ పాఠశాల విద్య అభ్యసించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 13 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ సహకరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 విశ్వప్రసాద్, ఏఎల్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ కూర్మారావు, సీఆర్పీలు పి.సింహాచలం, హిమబిందు, మణికంఠ పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాల చట్టం రూపకల్పనకు చర్యలు చేపట్టాలి

సీఎం, గవర్నర్‌లకు ఆదివాసీ జేఏసీ లేఖ

పాడేరు రూరల్, జూన్ 18: షెడ్యూల్డ్ ప్రాంతాల ఉద్యోగ నియామకాల చట్టం రూప కల్పనకు చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబునాయుడు, గవర్నర్ నజీర్‌లకు ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ నుంచి లేఖలు ద్వారా కోరామని జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు, చట్టాలను దెబ్బతీసే విధంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1) చెప్పిన విధంగా చట్టాలలో మార్పులు చేయలేదనే సాంకేతిక కారణంగా సుప్రీం కోర్టు జీవో నంబర్ 3ను కొట్టేసిందన్నారు. దీంతో అర్హత ఉన్నా గిరిజన యువతకు ఉద్యోగావకాశాలు కొరవడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. షెడ్యూల్ తెగల పరిపాలన, నియంత్రణకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎస్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు చొరవ తీసుకొని ఆదివాసీలకు మేలు జరిగే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. గిరిజన సంక్షేమ, అభివృద్ధికి టీఏసీ ద్వారా అవసరమైన తీర్మానాలు చేసుకొనే వెసులుబాటును ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీల చిన్నారులకు ధ్రువపత్రాల పంపిణీ

జి.మాడుగుల, జూన్ 18: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ ధ్రువపత్రాలు అందజేసినట్టు సూపర్ వైజర్ నాగమణి తెలిపారు. ఈ మేరకు మంళవారం గొందిమెళక, కృష్ణపురం, నీలమెట్ట, రచ్చపల్లి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ నిర్వహించిన ధ్రువపత్రాలు అందజేసినట్టుగా చెప్పారు. ఈ ధ్రువపత్రాలతో ప్రాథమిక పాఠశాలల్లో చేరవచ్చునని ఆమె తెలిపారు.

ఆశ్రమాల్లో ఆరోగ్య కార్యకర్తల నియామకాల సంతకం పై హర్షం

జి.మాడుగుల, జూన్ 18: గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మడి సంధ్యారాణి మొదటి సంతకం గిరిజన ఆశ్రమాల్లో ఏఎన్ఎంల పునరుద్ధరణపై చేయడంపై జనసేన మండల అధ్యక్షుడు మసాడి భీమన్న హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఆశ్రమ హస్టల్లో ఆరోగ్య కార్యకర్తలు లేక విద్యార్థులు మరణాలు అధికమయ్యాయని వాపోయారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో ఆశ్రమాల్లో ఆరోగ్య కార్యకర్తల కొనసాగించాలని నిర్ణయించడం, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడం ఆనందకరమని పేర్కొన్నారు.

కర్లాపొదర్ పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలి

ముంచంగిపుట్టు, జూన్ 18: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కర్లాపొదర్ గ్రామంలో అసంపూర్తి పనులతో నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని సర్పంచ్ కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. నాడు-నేడు పనులకు సంబంధించి రూ.38 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో భవనాలు అందుబాటులో లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తయ్యే విధంగా తగు చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యోగాతోనే మానసిన ఆరోగ్యం

అరకులోయ, జూన్ 18: యోగాసనాలతోనే మానసిక ఆరోగ్యం లభిస్తుందని అరకు కో-ఎడ్యుకేషన్ కళాశాల యోగా శిక్షకురాలు వై.విజయలక్ష్మి చెప్పారు. మంగళవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకురాలు మాట్లాడుతూ యోగా వల్ల కలిగే ప్రయోజనాలను, యోగా చేసేవారు పాటించాల్సిన నియమ, నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు ఎం.అనితకుమారి, పి.నాగబాబు తదితరులు పాల్గొన్నారు

పులిగొందిలో వివాహిత ఆత్మహత్య


స్వప్న (ఫైల్)

చింతపల్లి, జూన్ 18: మండలంలోని కిటుముల పంచాయతీ పులిగొంది గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పులిగొంది గ్రామానికి చెందిన కొర్ర స్వప్న (25) మంగళవారం మధ్యాహ్నం గృహంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివాహిత మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. స్వప్నకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహిత ఆత్మహత్య సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు ఎస్ఐ అరుణ్‌కిరణ్ తెలిపారు.